

RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక

విలేకరులు కావలెను

తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన

యువతీ యువకులకు జర్నలిస్ట్‌గా పనిచేసేందుకు సదావకాశం

న్యూస్ వార్ దిన పత్రిక

నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు,నియోజకవర్గాలు, మండల కేంద్రాలల్లో వార్తాసేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.

94409 91979

నల్లగొండ | epaper.news war.com | మంగళవారం 19, మే 2026 | సంపుటి :16 సంచిక :52 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00

## సముద్రగర్భ ఇంటర్నెట్
# కేబుల్స్‌పైనా టోల్ విధింపు..



### ఇరాన్ కొత్త ఆలోచన

హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టు బిగించడంతో ముడి చమురు రవాణాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడి ధరలు ఆకాశాన్నంటాయి. ఈ క్రమంలో ఇరాన్ తాజాగా హోర్ముజ్ జలసంధిలోని సముద్ర గర్భ ఇంటర్నెట్ కేబుల్స్‌పై కూడా దృష్టి సారించింది. ఈ కేబుల్స్‌పై కూడా టోల్ వసూలుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి.సముద్రం అడుగున ఉన్న ఈ కేబుల్స్ గ్లోబల్ ఇంటర్నెట్ వ్యవస్థకు జీవనాడిగా మారాయి.

గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి దిగ్గజ టెక్ సంస్థలన్నీ ఈ తీగల ద్వారా జరిగే డేటా మార్పిడిపై అధారపడ్డాయి. అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లోని ఇంటర్నెట్ హబ్స్‌ను ఈ తీగలే అనుసంధానిస్తాయి. వీటికి నష్టం జరిగితే ఇంటర్నెట్ సేవలు నిలిపోవడం, లేదా నెమ్మదించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉంది.హోర్ముజ్‌పై సౌర్వభౌమత్వం తమదే అని పట్టుబడుతున్న ఇరాన్.. నౌకల రవాణాతో పాటు కేబుల్స్ వినియోగంపై కూడా టోల్ వసూలు కోసం ప్రయత్నిస్తోంది.

వార్త 2లో



### గోవుల అక్రమ రవాణా..
## డీజీపీకి ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ

తెలంగాణలో గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎమ్మెల్యే బహిరంగ లేఖ రాశారు. శనివారం(మే 16) రాత్రి గోవులతో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని.. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడకు చేరుకొని ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు.

2



### పంజాబ్ ఆప్ మంత్రి
## సంజీవ్ అరోరాకు జూన్ 1 వరకు జ్యుడీషియల్ రిమాండ్

ఆమ్ ఆద్మీ పార్టీ కి మరో ఎదురుదెబ్బ తగిలింది. వస్తు సేవల పన్ను లావాదేవీలలో జరిగిన భారీ మోసాలకు సంబంధించి పంజాబ్ మంత్రి సంజీవ్ అరోరాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. సుమారు రూ.100 కోట్ల మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఈ అరెస్ట్ జరిగినట్లు ఈడీ వర్గాలు వెల్లడించాయి.అరెస్ట్ అనంతరం ఈడీ అధికారులు సంజీవ్ అరోరాను గురుగ్రామ్ సెషన్స్ కోర్టులో హాజరుపరిచారు.


2




### వందేభారత్
## ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ పై ఆగంతకులు రాళ్లురువ్విన ఘటన బీహార్‌లోని ముజఫ్ఫర్‌పుర్ లో సోమవారంనాడు చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలు కోచ్‌లకు చెందిన కిటికీ అద్దాలు దెబ్బతిన్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. మజ్‌హౌలియా–ఖాబ్రా ప్రాంత సమీపంలో పాటలీపుత్ర–గోరఖ్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (26501)పై ఈ రాళ్లదాడి జరిగింది. మూడు కోచ్‌లకు చెందిన కిటికీ అద్దాలు దెబ్బతిన్నట్టు చెబుతున్నారు. దీనిపై ప్రయాణికులు వెంటనే రైల్వే అధికారులు, రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ కు సమాచారం ఇచ్చారు.

2



2

## హైదరాబాద్ కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు స్టే

### నిజామాబాద్ జిల్లాకు పంగనామాలు
## పెట్టిన సీఎం రేవంత్ : బీజేపీ ఎంపీ

2 లో..



నిజామాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారని స్థానిక ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. సోమవారం నిజామాబాద్‌లో ఎంపీ అరవింద్ విలేకర్లతో మాట్లాడుతూ.. టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో టీపీసీసీ చీప్ మహేష్ కుమార్ గౌడ్ తిరుగుతున్నారని ప్రశ్నించారు. నిజామాబాద్‌కు అవుటర్ రింగ్ రోడ్ ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



2

### చికాగో సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం..
## తెలంగాణకు చెందిన 24 ఏళ్ల విద్యార్థిని దుర్మరణం



2

### బండి భగీరథ్ కేసు..
## కొత్త సెక్షన్‌ను జోడించిన పోలీసులు

### రేవంత్.. రిజర్వాయర్లు పరిశీలించి నీటి
## సమస్య తీర్చు: వివేకానంద

హైదరాబాద్:

పలు రిజర్వాయర్లు కట్టి నీటి కష్టం తీర్చిన మహనీయుడు మాజీ సిఎం కెసిఆర్ అని బిఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద కొనియాడారు. ఇంటింటికీ నల్లా కనెక్షన్ పెట్టించి నీటి ట్యాంకర్ల బాధ తీర్చారని అన్నారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ ఐడిపిఎల్ లోని హెచ్ఎండబ్ల్యూఎస్ వాటర్ వర్క్స్ ముందు వివేకానంద ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో మహిళలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..మూడేళ్ల పాలనలో ప్రతి కాలనీ, బస్తీలో నీటి ఎద్దడి ఉందని, గాలిమోటార్లతో తిరుగుతూ గాలి మాటలతో సిఎం రేవంత్ రెడ్డి నెట్టుకొస్తున్నారని వివేకానంద విమర్శించారు. ఢిల్లీకి డబ్బు మూటలు పంపడంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై పట్టదా? అని ప్రశ్నించారు. ఢిల్లీకి పోవుడు కాదని, రిజర్వాయర్లు పరిశీలించి నీటి సమస్య తీర్చు అని అన్నారు. నీటి సమస్య పరిష్కరించకపోతే రేవంత్ ఇంటిని ముట్టడిస్తామని వివేకానంద హెచ్చరించారు.





2

## బిజెపిపై బిఆర్ఎస్, కాంగ్రెస్ దుష్ప్రచారం : రాంచందర్ రావు

# సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్స్‌పైనా టోల్ విధింపు..

## ఇరాన్ కొత్త ఆలోచన

ఇంటర్నెట్ డెస్క్:న్యూస్‌వార్ ప్రతినిధి



హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టు బిగించడంతో ముడి చమురు రవాణాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడి ధరలు ఆకాశాన్నంటాయి. ఈ క్రమంలో ఇరాన్ తాజాగా హోర్ముజ్ జలసంధిలోని సముద్ర గర్భ ఇంటర్నెట్ కేబుల్స్‌పై కూడా దృష్టిసారించింది. ఈ కేబుల్స్‌పై కూడా టోల్ వసూలుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి.సముద్రం అడుగున ఉన్న ఈ కేబుల్స్ గ్లోబల్ ఇంటర్నెట్ వ్యవస్థకు జీవనాడిగా మారాయి. గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి దిగ్గజ టెక్ సంస్థలన్నీ ఈ తీగల ద్వారా జరిగే డేటా మార్పిడిపై అధారపడ్డాయి. అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లోని ఇంటర్నెట్ హబ్స్‌ను ఈ తీగలే అనుసంధానిస్తాయి. వీటికి నష్టం జరిగితే ఇంటర్నెట్ సేవలు నిలిపోవడం, లేదా నెమ్మదించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉంది.హోర్ముజ్‌పై సార్వభౌమత్వం తమదే అని పట్టుబడుతున్న ఇరాన్.. నౌకల రవాణాతో పాటు కేబుల్స్ వినియోగంపై కూడా టోల్ వసూలు కోసం ప్రయత్నిస్తోంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్ వంటి సంస్థలు ఈ కేబుల్స్‌ను వినియోగించినందుకు తమకు ఫీజు చెల్లించాలని కోరుతోంది. కంపెనీలు తమ డిమాండ్స్‌కు ఒప్పుకోకపోతే ఇంటర్నెట్ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడవచ్చని కూడా ఇరాన్ పత్రికలు కొన్ని హెచ్చరించాయి. ఈ కేబుల్స్ వాడినందుకు ఫీజులు వసూలు చేస్తామని ఇరాన్ మిలిటరీ ప్రతినిధి ఒకరు గతవారమే ఎక్స్ వేదికగా ప్రకటించారు.ఇరాన్ చట్టాలకు అనుగుణంగా టెక్ సంస్థలు తమ కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుందని ఇరాన్ సైన్యం చెబుతోంది. సముద్రగర్భ కేబుల్స్ ఆపరేటర్లు తమకు లైసెన్సు ఫీజులు కూడా చెల్లించాలని పేర్కొంది. ఇక కేబుల్స్ రిపేర్లు, నిర్వహణ కాంట్రాక్టులు ఇరాన్ సంస్థలకే ఇవ్వాల్సి ఉంటుందని చెబుతోంది. ఇలాంటి ఫీజుల వసూలు చట్టబద్ధమని కూడా ఇరాన్ వాదిస్తోంది. సముద్రగర్భ మౌలికవసతులకు సంబంధించి ఫీజులు వసూలు చేసుకునే హక్కు తీరప్రాంత దేశాలకు ఉంటుందని అంతర్జాతీయ చట్టాలు చెబుతున్నాయని అంటోంది. సూయిజ్ కెనాల్ అడుగున ఉన్న సముద్రగర్భ కేబుల్స్‌పై ఈజిప్టు ఇప్పటికే పలు రకాల ఫీజులు వసూలు చేస్తున్న విషయాన్ని ఇరాన్ మీడియా ప్రస్తావించింది. అయితే, సూయిజ్ కెనాల్ జలమార్గం మనుషులు నిర్మించినది కావడంతో ఈ జలసంధికి సంబంధించిన నిబంధనలు హోర్ముజ్‌కు వర్తిస్తాయా? అన్న చర్చ కూడా జరుగుతోంది. ఇక అమెరికా ప్రభుత్వ ఆంక్షల ప్రకారం, అక్కడి సంస్థలు ఇరాన్‌తో ఎలాంటి లావాదేవీలు జరపకూడదు. దీంతో, వాటి నుంచి ఇరాన్ ఫీజులను ఎలా వసూలు చేస్తుందనే ప్రశ్న కూడా తలెత్తుతోంది.

## గోవుల అక్రమ రవాణా.. డీజీపీకి ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

తెలంగాణలో గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎమ్మెల్యే బహిరంగ లేఖ రాశారు. శనివారం(మే 16) రాత్రి గోవులతో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని.. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడకు చేరుకొని ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని.. హిందువైనా, ఎంఐఎం నాయకులైనా ఒకే విధంగా చూడాలని అన్నారు.గోవుల అక్రమ రవాణా చేస్తూ బహిరంగంగా తిరుగుతున్న వారిపై వెంటనే కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు.. రాజకీయ ఒత్తిడికి లోనుకాకుండా పని చేయాలని తెలిపారు. హిందువులపై మాత్రమే చర్యలు తీసుకుంటే ప్రజల్లో అనుమానాలు వస్తాయన్నారు. గోమాతను కాపాడాలని చెప్పే ప్రభుత్వం.. అక్రమ రవాణాను ఎందుకు ఆపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఎవరైనా చట్టం ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ డీజీపీ వెంటనే ఈ విషయంపై స్పందించి చర్యలు తీసుకోవాలని రాజాసింగ్ లేఖలో స్పష్టం చేశారు.

## పంజాబ్ ఆప్ మంత్రి సంజీవ్ అరోరాకు జూన్ 1 వరకు జ్యుడీషియల్ రిమాండ్

న్యూఢిల్లీ, న్యూస్‌వార్ ప్రతినిధి

ఆమ్ ఆద్మీ పార్టీ కి మరో ఎదురుదెబ్బ తగిలింది. వస్తు సేవల పన్ను లావాదేవీలలో జరిగిన భారీ మోసాలకు సంబంధించి పంజాబ్ మంత్రి సంజీవ్ అరోరాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. సుమారు రూ.100 కోట్ల మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఈ అరెస్ట్ జరిగినట్లు ఈడీ వర్గాలు వెల్లడించాయి.అరెస్ట్ అనంతరం ఈడీ అధికారులు సంజీవ్ అరోరాను గురుగ్రామ్ సెషన్స్ కోర్టులో హాజరుపరిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. ఆయనకి జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఈ కేసు తదుపరి విచారణను జూన్ 1వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.జీఎస్టీ చెల్లింపులు, దానికి సంబంధించిన లావాదేవీలలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, తప్పుడు పద్ధతుల్లో నిధులను మళ్లించారనే ఆరోపణలపై గత కొంతకాలంగా ఈడీ దర్యాప్తు చేస్తోంది. సుమారు రూ. 100 కోట్ల మేర మనీలాండరింగ్ జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించడంతో, లోతైన విచారణ కోసం మంత్రి సంజీవ్ అరోరాను ఈడీ బృందం అదుపులోకి తీసుకుంది.పలువురు కీలక నేతలు ఇప్పటికే వివిధ కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్న తరుణంలో, పంజాబ్ మంత్రి అరెస్ట్ కావడం ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. దీనిపై పంజాబ్ ప్రభుత్వం, ఆప్ అధిష్ఠానం ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి

పాట్నా: న్యూస్‌వార్ ప్రతినిధి

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ పై ఆగంతకులు రాళ్లురువ్విన ఘటన బీహార్‌లోని ముజఫ్ఫర్‌పుర్ లో సోమవారంనాడు చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలు కోచ్‌లకు చెందిన కిటికీ అద్దాలు దెబ్బతిన్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు.మజ్‌హౌలియా-ఖాబ్రా ప్రాంత సమీపంలో పాటలీపుత్ర-గోరఖ్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (26501)పై ఈ రాళ్లదాడి జరిగింది. మూడు కోచ్‌లకు చెందిన కిటికీ అద్దాలు దెబ్బతిన్నట్టు చెబుతున్నారు. దీనిపై ప్రయాణికులు వెంటనే రైల్వే అధికారులు, రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ కు సమాచారం ఇచ్చారు.

### మరో రెండు రైళ్లపైనా..

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి జరిగిన కొద్ది సేపటికే అదే రైల్ సెక్షన్‌పై మరో రెండు రన్నింగ్ ట్రైన్స్‌పై రాళ్ల దాడి జరిగింది. పాట్నా-జైనగర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (15550), లిచ్ఛవి ఎక్స్‌ప్రెస్ (14006)ను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడుల్లో రెండు రైళ్లలోని పలు బోగీల కిటికీ అద్దాలు దెబ్బతిన్నాయి.

### ప్యాసింజర్ రైలులో మంటలు

కాగా, బీహార్‌లోని ససారం రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న ప్యాసింజర్ రైలులో సోమవారం ఉదయం 6 గంటల సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. ససారం నుంచి పాట్నాకు వెళ్లాల్సిన ఈ రైలులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయాందోళనలతో పరుగులు తీశారు. ఒక కోచ్ మంటల్లో పూర్తిగా కాలిపోయింది. అయితే మంటలను వెంటనే అదుపులోకి తెచ్చారు. ఈ అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ ప్రమాదంలో ప్రయాణికులెవరూ గాయపడలేదు.

## చికాగో సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం..

### తెలంగాణకు చెందిన 24 ఏళ్ల విద్యార్థిని దుర్మరణం

నల్గొండ/చికాగో ,

: అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లిన తెలుగు రాష్ట్రానికి చెందిన ఓ విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. తెలంగాణలోని నల్గొండ జిల్లాకు చెందిన 24 ఏళ్ల నవ్య, శనివారం రాత్రి అమెరికాలోని ఇండియానా రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. నవ్య తన మాస్టర్ ఆఫ్ సైన్స్ (మీా) డిగ్రీ పూర్తి చేయడం కోసం రెండేళ్ల క్రితం అమెరికా వెళ్లింది. శనివారం రాత్రి ఆమె తన స్నేహితులతో కలిసి పార్ట్ టైమ్ ఉద్యోగానికి వెళ్తుండగా, వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక కారు బలంగా ఢీకొట్టింది. అమెరికాలోని నవ్య స్నేహితుల ద్వారా ఈ సమాచారం తమకు తెలిసిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.



## నిజామాబాద్ జిల్లాకు పంగనామాలు పెట్టిన సీఎం రేవంత్ : బీజేపీ ఎంపీ

నిజామాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

నిజామాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారని స్థానిక ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. సోమవారం నిజామాబాద్‌లో ఎంపీ అరవింద్ విలేకర్లతో మాట్లాడుతూ.. టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తిరుగుతున్నారని ప్రశ్నించారు. నిజామాబాద్‌కు అవుటర్ రింగ్ రోడ్ ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందూరు ప్రజలను మోసం చేస్తే వారే బుద్ధి చెబుతారన్నారు.దేవుళ్లను మోసం చేసిన వాడికి ప్రజలను మోసం చేయటం లెక్క కాదని నిజామాబాద్ బీజేపీ ఎంపీ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కావని కుండ బద్దలు కొట్టారు. ఇప్పటి వరకు నిజామాబాద్ నగరంలో 25 శాతం డ్రైనేజీ పనులు కూడా పూర్తి కాలేదన్నారు. రూ.162 కోట్లకు గాను కేవలం రూ. 10 కోట్ల నిధులు మాత్రమే యుడిసికి ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. 2039 వరకు రాహుల్ ప్రధాని కారని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. అంటే రాహుల్ ఇక ప్రధాని కాలేరని తెలంగాణ సీఎం చెప్పారు. తద్వారా ఇంకో పదేళ్లు దేశంలో బీజేపీ ఉంటుందని తెలంగాణ సీఎం ఒప్పుకున్నారని పేర్కొన్నారు.రేవంత్ రెడ్డికి బదులు కోమటిరెడ్డి లాంటి జెన్యూన్ పర్సన్‌ని తెలంగాణ ముఖ్యమంత్రిగా నియమించాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలకు ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ స్పష్టం చేశారు. బుల్లెట్ రైల్ కారిడార్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. పట్టణాన్ని అప్ గ్రేడ్ చేస్తానని ప్రకటించిన బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌నే ప్రజలు నమ్మలేదని.. ఇక లేని ఫ్యూచర్ సిటీ అంటే నమ్ముతారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ చురకలు అంటించారు.

## హైదరాబాద్ కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు స్టే

న్యూఢిల్లీ,న్యూస్‌వార్ ప్రతినిధి

కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది. ఎకో సెన్సిటివ్ జోన్(25-35 మీటర్ల పరిధి) లోపల ఉన్న చెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని సుప్రీం కోర్టు




ఆదేశాలు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టగా.. చెట్ల నరికివేతపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో పర్యావరణ ప్రేమికురాలు కాజల్ మహేశ్వరి పిటిషన్ దాఖలు చేశారు. కేబీఆర్ పార్క్ హైదరాబాద్‌కు ప్రధాన 'గ్రీన్ లంగ్స్' అని.. ఎకో సెన్సిటివ్ జోన్‌కు రక్షణ కోరుతూ పిటిషన్ వేశారు.2020 అక్టోబర్ 27న ఎకో సెన్సిటివ్ జోన్‌ను తగ్గిస్తూ నోటిఫికేషన్ జారీ అయ్యిందని.. పబ్లిక్ హియరింగ్ లేదని పిటిషనర్ ఆరోపించారు. ఎస్ఆర్‌డీపీ రోడ్డు ప్రాజెక్టుల కోసం ఎకో జోన్ కుదించారని అన్నారు. తెలంగాణ హైకోర్టు మార్చి 31న స్టే ఇచ్చేందుకు నిరాకరించిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టుల పిటిషన్ వేశారు. 19,000 మంది సంతకాలతో వ్యతిరేక పిటిషన్ వచ్చినా పట్టించుకోలేదని పిటిషనర్ ఆరోపించారు. పబ్లిక్ హియరింగ్ జరిగినట్టు రాష్ట్రం తప్పుడు సమాచారం ఇచ్చిందని పిటిషన్‌లో పేర్కొన్నారు.ఈరోజు(సోమవారం) జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ముందు ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. పర్యావరణ ప్రేమికుల తరఫున సీనియర్ కౌన్సిల్ కె.వివేక్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారు. దీంతో చెట్ల నరికివేతపై స్టే ఇచ్చిన సుప్రీంకోర్టు.. ఎకో సెన్సిటివ్ జోన్‌ను 'షాక్ అబ్జార్బర్'గా ఉంచాలని పేర్కొంది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు జూలై 27కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు స్టే ఆదేశాలతో ఎస్ఆర్‌డీపీ పనులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. ప్రధానంగా కేబీఆర్ జంక్షన్ పరిసరాల్లో ఫ్లైఓవర్ల నిర్మాణాలకు భారీ ఆటంకం ఏర్పడింది.

## బండి భగీరథ్ కేసు.. కొత్త సెక్షన్‌ను జోడించిన పోలీసులు

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

బండి భగీరథ్ కేసులో పోలీసులు కొత్తగా మరో సెక్షన్‌ను జోడించారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం చేశాడని ఆరోపణల నేపథ్యంలో బీఎన్ఎస్ 64(2)(ఎ) సెక్షన్‌ను కేసులో చేర్చారు. ఈ సెక్షన్ రుజువైతే కనీసం 10 సంవత్సరాలు జైలు శిక్ష లేదా జీవిత ఖైదు పడే అవకాశం ఉంది. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే బండి భగీరథ్‌పై బీఎన్ఎస్ 64(2)(ఎ), బీఎన్ఎస్ 74, బీఎన్ఎస్ 75 సెక్షన్లు, పోక్సో సెక్షన్ 5(1) రీ/డ 6 సెక్షన్లు నమోదు చేశారు. బాధితురాలి స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు ఈ కొత్త సెక్షన్‌ను జోడించారు.బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఈనెల 8న బండి భగీరథ్‌పై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేశారు. విచారణలో భాగంగా భగీరథ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేసినప్పటికీ గైర్హాజరయ్యారు. హైకోర్టులో మధ్యంతర బెయిల్ కోసం భగీరథ్ పిటిషన్ వేయగా.. అక్కడ కూడా అతడికి నిరాశే ఎదురైంది. మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించడంతో.. భగీరథ్ పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారు. భగీరథ్‌ను 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీలో చెర్లపల్లి జైలుకు పోలీసులు తరలించారు.

## బిజెపిపై బిఆర్ఎస్, కాంగ్రెస్ దుష్ప్రచారం : రాంచందర్ రావు

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

బిఆర్ఎస్ కోట్లు ఖర్చు చేసి బండిసంజయ్, ఆయన కుమారుడికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని టిబిజెపి చీఫ్ రాంచందర్ రావు ఆరోపించారు. బిఆర్ఎస్ కు రాష్ట్రంలో ఇంకో పని లేనట్టుందని అన్నారు. ఈ సందర్భంగా బిజెపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..బెయిల్ పెండింగ్ లో ఉంది, బండి సంజయ్ కుమారుడి భగీరథ్ సరెండర్ అయ్యాడని తెలియజేశారు. బండి సంజయ్ తప్పు చేయలేదని, రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు బిజెపిపై దుష్ప్రచారం చేస్తున్నాయని రాంచందర్ రావు రాంచందర్ రావు విమర్శించారు. కుటుంబసభ్యులు తప్పు చేస్తే న్యాయపరంగా చూసుకుంటారని, బండి సంజయ్ తప్పు చేస్తే పార్టీ చర్యలు తీసుకుంటుందని అన్నారు. బండి సంజయ్ ను లక్ష్యంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, బిఆర్ఎస్ హయాంలో మహిళలపై 67 శాతం క్రైమ్ రేటు పెరిగిందని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేపై మహిళా సర్పంచ్ లైంగికంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేసిందని, మద్యం కేసులో మహిళ జైలుకు వెళ్లితే మాజీ సిఎం కెసిఆర్, కెటిఆర్, రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. ముందస్తు బెయిల్ తీసుకోవడం అనేది హక్కు అని ఆయన పారి పోలేదని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ అధినేత కవిత లిక్కర్ కేసులో జైలుకు వెళ్తే కెసిఆర్, కెటిఆర్ రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. కెటిఆర్ కు నైతిక విలువలు లేవని, ప్రజా సమస్యలపైన పోరాడటం చేతగాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలని సూచించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ కలిశాయి కాబట్టి అరెస్ట్ చేయడం లేదని, రైతులు ధాన్యం కొనుగోళ్లు జరగక ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం, ఈ కార్ రేస్ కేసులో కెసిఆర్, కెటిఆర్ ను సిఎం రేవంత్ రెడ్డి అరెస్ట్ చేయాలని రాంచందర్ రావు కోరారు.

## పంటల కొనుగోళ్లపై ప్రభుత్వానికి రివ్యూ చేసే తీరిక లేదు: జగదీష్ రెడ్డి

హైదరాబాద్:

మిషన్ భగీరథ పథకంలో మాజీ సిఎం కెసిఆర్ ఫ్లోరైడ్ ను తరిమివేశారని బిఆర్ఎస్ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తెలిపారు. నాడు కేంద్రం వడ్లు కొనకపోతే ఢిల్లీలో కెసిఆర్ ధర్నా చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. నల్గొండ లో నాటి సమైక్య రాష్ట్రంలోని రైతుల కష్టాలే రైతులకు మళ్లీ వచ్చాయని విమర్శించారు. 24 గంటల కరెంట్, సాగునీళ్లు, పెట్టుబడి సాయం ఇచ్చి..రైతులను కడుపులో పెట్టుకొని చూసుకున్న నాయకుడు కెసిఆర్ అని కొనియాడారు. రైతుల ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొని రైతుల ఖాతాలో నగదు వేసినామని, ఇవాళ తెలంగాణలో ఎపి సిఎం చంద్రబాబు శిష్యుడు సిఎం రేవంత్ రెడ్డి దుర్మార్గ పాలన చేస్తున్నారని జగదీష్ రెడ్డి మండిపడ్డారు. రైతులను పట్టి పీడిస్తున్నారని, అరిగోస పెడుతున్నారని, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లు ఏదీ పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. మిల్లర్లతో మంత్రులు కుమ్మకక్కై రైతులను దోచుకుంటున్నారని, పంటల కొనుగోళ్లపై ప్రభుత్వానికి రివ్యూ చేసే తీరిక లేదని ఎద్దేవా చేశారు. ప్రధాని నరేంద్రమోడీ కనుసన్నల్లో కొనసాగుతున్న హైబ్రిడ్ ప్రభుత్వమిది అని జగదీష్ రెడ్డి దుయ్యబట్టారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

సంపాదకీయం...

# సంక్షోభమా లేక అవకాశమా?

**ప్రస్తుత సంవత్సరం ప్రారంభంలో భారత ఆర్థిక వృద్ధిపై అంచనాలు 6.8 శాతం నుంచి 7.2 శాతం మధ్యలో ఉన్నాయి. అయితే ఇరాన్‌పై జరిగిన దాడి తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ముడి చమురు ధరలు ఆకాశమంటాయి, రూపాయి విలువ తీవ్రంగా పడిపోయింది. ఫలితంగా మూడీస్ సంస్థ 2026లో భారత వృద్ధిరేటు 6 శాతానికి పడిపోతుందని హెచ్చరిస్తోంది. ఇటీవలి తాజా గణాంకాల ప్రకారం భారత వాస్తవ జిడిపి (స్థూల దేశీయోత్పత్తి) వృద్ధి 2025- 26లో 7.6 శాతంగా ఉంది. అయితే 2026- 27లో ఈ వృద్ధిరేటు మందగిస్తుందని, ఇంధన ధరల పెరుగుదల, ప్రపంచ వాణిజ్య అనిశ్చితుల కారణంగా సవాళ్లు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ముందున్న దారి ఏమిటి? రూపాయి బలహీనతను ప్రయోజనంగా మార్చుకోవడం సమంజసమైన మార్గం. ఒక సంవత్సరం క్రితం ఒక డాలర్ విలువ సుమారు 85 రూపాయలు ఉండేది. నేడు అది 96 రూపాయలకు చేరింది. ఫలితంగా భారత ఎగుమతులు చౌకగా, పోటీతత్వంతో మారాయి. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఎగుమతి రంగాన్ని ప్రోత్సహించాలి. అంతేకాకుండా విదేశీ కంపెనీలకు భారత్‌లో తయారీ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి అనువైన వాతావరణాన్ని కల్పించాలి. ప్రధాని మంత్రి రైతులను సౌర పంపుల వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. ఎలక్ట్రిక్ వాహనాలు, జీవఇంధనాలను మరింతగా ప్రోత్సహించాలి.**

రష్యా రూపాయలకు చమురును విక్రయించడానికి సిద్ధపడితే దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకోవాలి. ఈ చర్యలు దిగుమతి బిల్లును గణనీయంగా తగ్గించగలవు. ప్రస్తుతం చమురు, బంగారం, ఎరువులు, వంటనూనె, ఎలక్ట్రానిక్స్ ఈ ఐదు వస్తువుల దిగుమతులే భారత మొత్తం దిగుమతుల్లో సగానికి పైగా ఉన్నాయి. దేశీయ వినియోగ డిమాండ్ భారత ఆర్థిక వృద్ధికి ప్రధాన





చోదకశక్తి. ద్రవ్యోల్బణం పెరిగితే వినియోగం దెబ్బతింటుంది. ముఖ్యంగా దిగువ ఆర్థిక వర్గాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ప్రభుత్వాలు చేస్తున్న నగదు బదిలీలు అంతా ఈ వర్గాలను రక్షించడంలో సహాయపడతాయి. మరోవైపు కరోనా సమయంలో చూసినట్లు ప్రీమియం వినియోగ డిమాండ్ స్థితిస్థాపకంగా ఉంటుంది. బలమైన స్టాక్ మార్కెట్లు సంపన్న వర్గాలకు పెట్టుబడుల్లో లాభాలు అందిస్తున్నాయి, తద్వారా వారి వినియోగ సామర్థ్యం పెరుగుతోంది. భారత ఆర్థిక దృశ్యంలో మరో ముఖ్యమైన సవాల్ నిరుద్యోగ సమస్య. 2026లో యువత నిరుద్యోగిత రేటు 15 శాతానికి చేరింది. 22- 29 సంవత్సరాల వయస్సు గల గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగిత రేటు 33 శాతంగా ఉంది. గ్రాడ్యుయేట్లలో సుమారు 40 శాతం మంది ఉపాధి లేకుండా ఉన్నారు. భారత్‌లో 15 -29 సంవత్సరాల మధ్య 367 మిలియన్ల యువకులు ఉన్నారు. ఇది అద్భుతమైన జనాభా సామర్థ్యం. అయితే విద్యా నైపుణ్యాలకు, సృష్టించబడుతున్న ఉద్యోగాలకు ఎంతో అంతరం ఉంది. ప్రతి సంవత్సరం 50 లక్షల గ్రాడ్యుయేట్లు ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. కానీ తగినంత ఉద్యోగాలు లేకపోవడంతో ఈ విద్యా సామర్థ్యం సరైన ప్రయోజనాలను అందించడం లేదు. జనాభా డివిడెండ్ ప్రయోజనాన్ని పొందడానికి 2030 నాటికి సమయం చాలా కఠినంగా మారుతోంది. ఆ తర్వాత కార్మిక వయస్సు జనాభా వాటా తగ్గడం ప్రారంభమవుతుంది. వాతావరణ మార్పు ప్రభావం కూడా ఆర్థిక వ్యవస్థపై దృష్టి పెట్టాల్సిన అంశం. ప్రపంచంలోనే అత్యంత వేడిగా ఉండే 100 నగరాల్లో 98 భారత్‌లోనే ఉన్నాయి. గత ఏప్రిల్ 25న గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 256 జిడబ్ల్యు (గిగావాట్)కు చేరింది. గత ఏడాది ఇదే నెలలో 235 జిడబ్ల్యుగా ఉండేది. గ్రిడ్లపై భారం పెరిగి, లోడ్ షెడ్డింగ్ ప్రమాదం పెరుగుతుంది. ఇది ఉత్పాదన మీద తీవ్ర ప్రభావం చూపిస్తుంది. రైతులు అప్పటికే ఇన్పుట్ ఖర్చులతో పోరాడుతున్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతంలో కొరత ఏర్పడి, వ్యవసాయ ఉత్పత్తి తీవ్రంగా దెబ్బతింటుంది. 2025లో తీవ్ర వాతావరణ ఘటనలు 4,419 మంది ప్రాణాలను బలితీసుకున్నాయి, 2025లోనే 99 శాతం రోజుల్లో తీవ్ర వాతావరణం నెలకొంది. ఈ మహమ్మారి స్థాయి సంక్షోభం కొనసాగితే ఆర్థిక వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉంది. తెలుగు రాష్ట్రాలను ప్రత్యేకంగా పరిశీలిస్తే, తెలంగాణ నగరీకరణ రంగంలో దేశాన్నే దాటిపోయింది. 50.08 శాతం నగరీకరణ ఉంటుందని అంచనా. ఇది దేశ సగటు 36.01 శాతం కంటే చాలా ఎక్కువ. కృత్రిమమేధ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) టెక్నాలజీతో బిల్డింగ్ నిర్మాణ అనుమతుల ప్రక్రియను సామాన్యంగా మారుస్తుంది. బిల్డ్ వేదిక 24 లక్షల చదరపు అడుగుల, 66 అంతస్తుల భవన నిర్మాణ ప్రణాళికను కేవలం 1 నిమిషం 31 సెకన్లలో పరిశీలించి రికార్డు సృష్టించింది. వ్యవస్థకు మంచి సామర్థ్యం ఉంది. కానీ ఇలాంటి సాంకేతిక సామర్థ్యం ఉద్యోగాల కల్పనకు అనువదించబడుతుందా లేదా అనేది ప్రశ్న. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో అమెజాన్ మార్కెట్ వృద్ధి నాలుగు రెట్లు పెరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలు కలిపి అమెజాన్ దగ్గర 75 వేలకు పైగా విక్రేతలు ఉన్నారు.

# భోజ్‌శాల వద్ద భద్రత కట్టుదిట్టం

## హైకోర్టు తీర్పుతో జిల్లా యంత్రాంగం చర్యలు

**భోపాల్,**

భోజరాజు కాలంలో ఏర్పాటు చేసిన భోజశాల కాలక్రమంలో ఇస్లాం దాడుల్లో కనుమరుగయ్యింది. దానిని ముస్లింలు స్వాధానం చేసుకున్నారు. ఆనాటి నుంచి ఆ వివాదం కొనసాగుతూనే ఉంది. ఇది సరస్వతీమాత ఆలయంగా హిందువుల విశ్వాసం. తాజాగా మధ్యప్రదేశ్‌లోని వివాదాస్పద భోజ్‌శాల కాంప్లెక్స్ హిందూ ఆలయానికి చెందుతుందని ఆ రాష్ట్ర హైకోర్టు శుక్రవారం నాడు సంచలన తీర్పు వెలువరించింది. మసీదు నిర్మాణం కోసం ముస్లింలు ప్రత్యామ్నాయ స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు జస్టిస్ విజయ్ కుమార్ శుక్లా, జస్టిస్ అలోక్ అవస్థితో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడ సరస్వతిదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆలయాన్ని సందర్శించే ప్రజలకు తగిన వసతులు కల్పించాలని సూచించింది. భోజ్‌శాల కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకోవాలని కేంద్ర పురావస్తు శాఖను ధర్మాసనం ఆదేశించింది. ఈ చారిత్రక కట్టడం పరిరక్షణ, భద్రత, మతపరమైన ఆచారాల నియంత్రణకు సంబంధించి పురావస్తు శాఖకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. 1958 నాటి ఎఎస్ఐ చట్టం ప్రకారం, ఈ ఆస్తుల బాధ్యతలను ఎఎస్ఐ నిర్వర్తిస్తుందని ధర్మాసనం తెలిపింది. భోజ్‌శాల ఆలయ వ్యవహారాలు, పరిపాలనపై కేంద్ర ప్రభుత్వం, పురావస్తు శాఖ సంయుక్తంగా తుది నిర్ణయం తీసుకుంటాయని తెలిపింది. భవిష్యత్తులో ఈ




కట్టడం చారిత్రక నేపథ్యం దెబ్బతినకుండా ఎఎస్ఐ పర్యవేక్షణలో నిర్వహణ కొనసాగుతుందని ధర్మాసనం తెలిపింది. పురావస్తు శాఖ ఇటీవల సమర్పించిన రెండు వేల పేజీల సర్వే నివేదికను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. మసీదు నిర్మాణం కంటే ముందే అక్కడ పర్మార్ రాజుల కాలం నాటి ఆలయం ఉండేదని, పాత ఆలయ భాగాలతోనే మసీదు నిర్మించారని పురావస్తు శాఖ నివేదికలో పేర్కొంది. ఈ ఆధారాలనే ధర్మాసనం ప్రామాణికంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించి సవాలు చేస్తామని ముస్లిం గ్రూపు ప్రకటించింది. మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేస్తుందన్న విశ్వాసం తమకు ఉందని ఎఐఎఐఎం నేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసి సోషల్ మీడియాలో పేర్కొన్నారు. కోర్టు తీర్పు నేపథ్యంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం ధార్ జిల్లాలో భద్రతను కట్టుదిట్టం చేసింది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ధార్‌లోని భోజ్‌శాల ఆలయం- కమల్ మౌలా మసీదు కాంప్లెక్స్ పరిసరాల్లో దాదాపు 1,200 మంది పోలీసులను మోహరించారు. వివాదాస్పద ప్రదేశాల్లో అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన కంటెంట్‌ను వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ధార్ కలెక్టర్ రాజీవ్ రంజన్ మీనా హెచ్చరించారు.

# కాకినాడ జిల్లాలో ఘోర ప్రమాదం

### రోడ్డు దాటుతున్న కూలీలపై దూసుకెళ్లిన టిప్పర్

### ప్రమాదంలో నలుగురు మహిళా కూలీల దుర్మరణం

### ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన డిప్యూటి సిఎం

**కాకినాడ,**

జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కోవూరు బ్రిడ్జి వద్ద శనివారం జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు ఉపాధి హామీ కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు దాటుతున్న కూలీలను.. టిప్పర్ లారీ బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి హామీ పనుల నిమిత్తం కూలీలు రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన ఓ టిప్పర్ లారీ వారిపైకి దూసుకెళ్లింది. లారీ వేగాన్ని నియంత్రించలేకపోవడంతోనే ఈ ఘోర ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. చనిపోయిన కూలీలు.. సత్యవతి, కృష్ణమ్మ, చిట్టెమ్మ, అన్నవరంగా గుర్తించారు. వీరంతా స్థానిక చీడిగ ప్రాంతానికి చెందినవారని పోలీసులు తెలిపారు.



క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (ఉఉఊ)కి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో మృతుల గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి పొంగూరు నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం పనులకు వెళ్తున్న నలుగురు మహిళా కూలీలు ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద ఘటనపై సమాచారం అందిన వెంటనే మంత్రి నారాయణ స్థానిక అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ఎలాంటి లోటు రాకుండా, తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని, వైద్య అధికారులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి నారాయణ భరోసా ఇచ్చారు. ఘోర రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో నలుగురు మహిళా ఉపాధి హామీ శ్రామికులు మృతి చెందడం బాధాకరమని అన్నారు. చీడిగ గ్రామానికి చెందిన ఆరుగురు మహిళా శ్రామికులు రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు చెప్పారని డిప్యూటీ సీఎం తెలిపారు. పని ప్రదేశంలో ఇలాంటి విషాదకర ఘటన జరగడం తీవ్రంగా కలచివేసిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కాకినాడ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు వెల్లడించారు. బాధితులు పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని చెప్పారు. మృతి చెందిన శ్రామికుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం పెంచిన పరిహారం రూ.4 లక్షలను త్వరితగతిన అందజేస్తామని తెలిపారు. లాగే రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.2 లక్షల సహాయంతో పాటు పీఎం సురక్ష యోజన, పీఎం జీవన్ జ్యోతి యోజన కింద లభించే బీమా మొత్తాన్ని కూడా అందిస్తామని పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా రహదారుల పక్కన జరుగుతున్న ఉపాధి పనుల వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ రహదారులు, బైపాస్ రోడ్లు, ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించారు.


# ఆదివారం నుంచి అధిక జేష్టమాసం

### పెళ్లిళ్లు తదితరాలకు నెలపాటు విరామం

### శుభముహూర్తాలకు బ్రేక వేళ తగ్గిన బంగారం ధరలు

**విజయవాడ,**

అధిక జేష్టమాసంతో శుభముహూర్తాలు అయిపోయాయి. మరో నెలరోజుల తరవాతనే పెళ్లి తదితర ముహూర్తాలకు ఛాన్స్ ఉంది. గురువారం నుంచి అన్నిరకాల శుభ ముహూర్తాలు ముగిసాయని పండితులు చెబుతున్నారు. ఫిబ్రవరి నుంచి మే 13 వరకూ తెలుగు లోగిళ్ళను వివిధ రకాల శుభకార్యాలతో కళకళలాడాయి. ఇప్పుడు ముహూర్తాలు నెల రోజల పైబడి లేవని సెలవిచ్చారు. ఆదివారం నుంచి అధిక జ్యేష్ట మాసం రానుండడంతో జూన్ 20 వరకూ మంచి రోజులు లేవని పురోహితులు చెపుతున్నారు.జూన్‌లో చివరి 8 రోజులు మంచి ముహూర్తాలున్నాయని పండితులు వివరిస్తున్నారు. జూలైలో మరో నాలుగు రోజులు మాత్రమే ముహూర్తాలున్నాయిని ఆ తరువాత చతుర్మాసం తదితర కారణాలతో ఆగస్టులో 11 రోజులు, సెప్టెంబరులో 4, అక్టోబరులో మరో 4 రోజులు మాత్రం ముహూర్తాలున్నా చతుర్మాసం అడ్డొస్తోందని పురోహితులు అంటున్నారు. ఆ తరువాత నవంబరులో కార్తీక మాసం కారణంగా 11 రోజులు, డిసెంబరులో మరో 14 రోజుల్లో కూడా అనువైన ముహూర్తాలున్నాయంటున్నారు. దీంతో పెళ్లిళ్లపై ఆధారపడ్డ వారు ,ఇతర కార్యక్రమాలపై ఆధారపడ్డ వారికి ఖాళీగా ఉండాల్సిన ఆగత్యం ఏర్పడింది. కారణం ఏదైనా భారత్‌లో బంగారం ధరల ర్యాలీకి బ్రేక్ పడినట్టు కనిపిస్తోంది. అంతర్జాతీయ అనిశ్చితులు, కేంద్రం దిగుమతి సుంకాల పెంపు నేపథ్యంలో బంగారం, వెండి ధరల్లో భారీ కోత కనిపించింది. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం, శుక్రవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,090కు పడిపోయింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధరలో ఏకంగా రూ.2,240ల మేర కోత పడింది. 22 క్యారెట్ల పసిడి ధర కూడా రూ.1,46,750కు చేరుకుంది. నిన్నటితో పోలిస్తే ధర రూ.2,050ల మేర తగ్గింది. నగరంలో వెండి ధరలో కూడా రూ.10 వేల కోత పడింది. ప్రస్తుతం కిలో వెండి రూ.3.05 లక్షల వద్ద ట్రేడవుతోంది ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర



రూ.1,63,390గా ఉంది. ఢిల్లీలో రూ.1,60,240గా, ముంబైలో రూ.1,60,090 వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,49,500గా, ఢిల్లీలో రూ.1,46,900గా, ముంబైలో రూ.1,46,750గా ఉంది. చెన్నై సహా పలు నగరాల్లో వెండి దర రూ.3.05 లక్షల వద్ద ట్రేడవుతోంది. నిన్నటితో పోలిస్తే దేశంలో కిలో వెండి ధర రూ.10 వేల మేర తగ్గింది.

-----------------

న్యూస్ వార్
వార్తా పత్రిక

# ముదిరాజ్ లను బీసీ ఏ లో చేర్చడంపై గంగపుత్రుల వైఖరి మార్చుకోవాలి

చౌటుప్పల్ మే 18 (న్యూస్ వార్)



ముదిరాజ్ కులస్తులను బిసి ఏలో చేర్చవద్దనే గంగపుత్ర సంఘం చేసిన ప్రకటనను ఖండిస్తున్నామని ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకులు దేప శ్యాం సుందర్ ముదిరాజ్ అన్నారు. ముదిరాజులను బిసి ఏ లో చేర్చడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను చూసి ఓర్వలేక చేస్తున్న ఈ కుట్రలను తిప్పికొడతామని మీకు కావలసిన హక్కులను మీరు అడగవచ్చు కానీ , మేము అడిగే హక్కులను హరించవద్దని , భవిష్యత్తులో ఇలాంటి ప్రకటనలు చేయవద్దని అన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన జనాభాలో ముదిరాజులే అత్యధికంగా ఉన్నారన్న విషయం తేట తెల్లమైందని, మేము కొత్తగా ఏమీ అడగడం లేదని , ప్రభుత్వం ఇచ్చిన మేనిఫెస్టోనే అమలు చేయాలని అంటున్నామన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ముదిరాజ్ ఐక్య సంఘాలు కలిసి అడగగా,వారు ప్రభుత్వ యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసి , సానుకూలంగా స్పందించారని , బీసీ ఏ అమలుకు అడుగులు పడుతున్న ఈ తరుణంలో గంగపుత్రులు ఇలా సమావేశాలు ప్రెస్ మీట్ లు పెట్టడం సరికాదని. ముదిరాజులు చేస్తున్న పోరాటంలో అన్ని ముదిరాజ్ సంఘాలు పాల్గొని ఐక్య ఉద్యమాలు చేసి ఇలాంటి ప్రకటనలను ఖండించాలని వారు కోరారు.

# కేంద్ర ప్రభుత్వం వైఖరిపై ఆర్డీవో కు వినతిపత్రం సమర్పించిన చౌటుప్పల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు



చౌటుప్పల్ మే 18 (న్యూస్ వార్)

మండల్ కెమిస్ట్డ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తాము చేపట్టబోయే బందు గురించి ముందస్తు సూచనను ఈరోజు స్థానిక ఆర్డిఓ కు వినతిపత్రం ద్వారా తెలియజేసినట్లు చౌటుప్పల్ మండలం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ప్రజల మేలుకొరకై కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఈనెల 20వ తేదీన తాము నిర్వహించబోయే బందుకు ప్రజలు ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు సహకరించవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

# పర్యాటక, చారిత్రక, పరిశోధన కేంద్రంగా మూడ్ మల్ నిలువు రాళ్ళు

ముడుమల్ నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు దక్కడం తెలంగాణకు గర్వకారణమని నారాయణపేట జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా కృష్ణా మండలం ముడుమల్ నిలువు రాళ్ల (మెన్హిర్స్) ను ఆమె సందర్శించారు. నిలువు రాళ్లు, సప్తర్షి మండలంతో ఖగోళ పరిజ్ఞానాన్ని, కాలాలను, వాతావరణ మార్పులను ఆనాడే తెలుసుకునేవారని, కాలాలను గుర్తించడానికి ఆది మానవులు నిలువురాళ్లను ఓ క్రమంలో ఏర్పాటు చేసినట్లు ఆర్కియాలజీ శాఖకు చెందిన అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఎలాంటి సాంకేతికత లేని 4 వేల సంవత్సరాల క్రితమే రాళ్ల ద్వారా తెలుసుకోవడం అనేది అబ్బురపరిచేలా, అద్భుతంగా ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వరకు యువజన క్రీడా/పర్యాటక వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ఆమె సూచించారు. రాష్ట్ర పర్యాటక శాఖ కు సంబంధించిన వారోత్సవాల టూరిస్ట్ గైడ్ పోస్టర్ తో పాటు మూడ్ మల్ నిలువు రాళ్ళ విశిష్టత ను తెలిపే ప్రచార పత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీ ఆర్ వో రషీద్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేశ్ శెట్టి, మూడ్ మల్ సర్పంచి, పురావస్తు శాఖ అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలి....

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్





వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలని, విపత్తుల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు జిల్లా యంత్రాంగాన్ని మాన్సూన్ సీజన్‌కు పూర్తి స్థాయిలో సిద్ధం చేసేందుకు చేపట్టిన ఫ్లడ్ మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.జిల్లాలోని మున్నేరు పరివాహక ప్రాంతంలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్.డి.ఎం.ఏ) మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించిన వరద ప్రమాదాల మాక్ ఎక్సర్సైజ్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వరదల వంటి విపత్తుల సమయంలో అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ప్రాణనష్టం నివారించవచ్చని అన్నారు. సాధారణంగా ప్రజలు నీరు కళ్లకు కనిపించే వరకు ఇళ్లను ఖాళీ చేయరని, ఈ ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు అధికారికంగా ఎవాక్యుయేషన్ సూచనలు ఇచ్చినప్పుడు ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని సూచించారు.వర్షాకాలంలో సంభవించే అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుండి సమాచారం అందిన వెంటనే వివిధ శాఖలు ఏ విధంగా స్పందించాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, రెస్క్యూ బృందాలు ఎలా పనిచేయాలి, రిలీఫ్ క్యాంపులను ఎలా నిర్వహించాలి వంటి అంశాలపై స్టెప్ బై స్టెప్ విధానంలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు.ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, టిఎస్టిడి, అగ్నిమాపక, పశుసంవర్ధక శాఖ, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విపత్తు సమయంలో చేపట్టాల్సిన చర్యలపై సాధన నిర్వహించి నట్లు తెలిపారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవచ్చున్నారు.అంతకుముందు మాక్ ఎక్సర్సైజ్ లో భాగంగ వరదల కారణంగా మున్నేరు పరివాహక ప్రాంతం ముంపుకు గురవుతుందని సమాచారం అందుకున్న జిల్లా కంట్రోల్ రూమ్ సంబంధిత అధికారులను, రెస్క్యూ బృందాలను అప్రమత్తం చేసింది. స్థానికంగా ఉన్న ఆపద మిత్ర వాలంటీర్ల సహకారంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి చేర్చడం జరిగింది.రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రిలీఫ్ క్యాంప్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్, అక్కడ బాధితులకు అందించాల్సిన ఆహారం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.వరదల సమయంలో ప్రజలు ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు కోల్పోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్‌లు, భూ పత్రాలు వంటి ముఖ్యమైన డాక్యుమెంట్లు, విలువైన వస్తువులను వాటర్ ప్రూఫ్ జిప్ బ్యాగ్‌లలో సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సమయంలో వెంట తీసుకుని వెళ్లేందుకు ప్రతి కుటుంబం ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని అన్నారు.ప్రజల్లో విపత్తుల నిర్వహణపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక అవగాహన వీడియోలు రూపొందించి వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఖమ్మం జనరల్ ఆస్పత్రి వద్ద వరదలలో ఎవరైనా చిక్కుకుంటే వారిని సంరక్షించి వైద్య సేవలు అందించేలా మాక్ ఎక్సర్సైజ్ చేపట్టామని అన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్డిఆర్ఎఫ్ 6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ బి. మరియాదాస్, ఎన్డీఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ఏఎంవిఐ, టీజీ ఎన్పిడిసిఎల్, వైద్య, ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ, మునిసిపల్, రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్, సంబంధిత శాఖల అధికారులు, రెస్క్యూ బృందాలు, ఆపద మిత్ర వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిని మరింత పకడ్బందీగా అమలు చేయాలి....

- ప్రజలకు మరింత చేరువలో డివిజన్ కార్యాలయాల్లో ప్రజావాణి....
- రాష్ట్రస్థాయి ప్రజావాణి ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ రాకేష్ రెడ్డి.....



ప్రజావాణిని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, ప్రజలకు చేరువలో డివిజన్ కార్యాలయంలో ప్రజావాణి పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా డివిజన్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్నీ సందర్శించారు.అనంతరం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తో ప్రజావాణి బలోపేతంపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి మరిన్ని కౌంటర్లు పెంచాలని, ప్రజావాణి లో కొన్ని చిన్న చిన్న మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తి గతంగా పరిశీలించాలని సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్మెంట్ చేయాలన్నారు . ప్రజలకు సమయపాలనతో సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు దరఖాస్తుదారునికి రశీదు అందజేయాలని, తద్వారా సమస్యల పరిష్కారం పట్ల పారదర్శకత నెలకొల్పాలని ఆదేశించారు. అదేవిధంగా, దరఖాస్తు పరిష్కారానికి సంబంధించి శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని ప్రాధాన్యంగా తీసుకుని, నిర్దిష్ట కాలపరిమితిలోపరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిష్కారం లో ఆలస్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ప్రజావాణి అధికారి శృతి నాయక్ , అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఓ ఎల్లయ్య, డిఆర్ఓ అంబాదాస్, రాజేశ్వర్ డిఆర్డిఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం

- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.





వరద ముప్పు ముంచెత్తితే.. క్షణాల్లో రక్షించే చర్యలపై కృష్ణా మండలం వాసునగర్ లో జిల్లా యంత్రాంగం లైవ్ డెమో. భవిష్యత్తులోసంభవించే ఎలాంటి విపత్తుల నైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో ఉందని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ డి ఎం ఏ) ఆదేశాలు, రాష్ట్ర విపత్తు స్పందన దళం ( ఎస్ డి ఆర్ ఎఫ్) సూచనల మేరకు నారాయణపేట జిల్లా కృష్ణా మండలం నదీ పరివాహక ప్రాంతమైన వాసునగర్ లో సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. భారీ వరదలు సంభవించిన సందర్భంలో ప్రజలను ఎలా రక్షించాలి, అత్యవసర పరిస్థితుల్లో స్పందనా బృందాలు ఎలా పనిచేయాలనే అంశాలపై ఈ మాక్‌డ్రిల్ చేపట్టారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా వరదల కారణంగా వాసు నగర్ లో ముంపునకు గురై చిక్కుకున్న ప్రజలను ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, అగ్నిమాపక, పోలీస్ శాఖలు సురక్షితంగా రక్షించే చర్యలను ప్రదర్శించారు. స్పందనా బృందాలు సమన్వయంతో పనిచేస్తూ బోటు, లైఫ్ జాకెట్ల సాయంతో ప్రజలను రక్షించి, ప్రథమ చికిత్స అందజేసి అంబులెన్సులో సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఈ మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక పరిశీలించి, సహాయక చర్యల నిర్వహణ తీరును దగ్గరుండి పర్యవేక్షించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సమయంలో ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ప్రజల్ని ఎలా కాపాడాలని అంశంపై మార్క్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు సంసిద్ధత కోసం ఈ మాక్ డ్రిల్ అనేది ఎంతో ముఖ్యమైన ప్రక్రియ అని తెలిపారు. వరదలు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడే ఏడు ప్రదేశాలను జిల్లాలో గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. 10 సెంటీమీటర్స్ పైన వర్షపాతం నమోదు అయితే కృష్ణానది కి 6 నుంచి 7 లక్షల క్యూసెక్కుల నీరు వస్తే వాసు నగర్ లో వరద నీటితో అత్యవసర పరిస్థితి ఏర్పడే నేపథ్యంలో ఇక్కడ మోక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు. అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, నీటిపారుదల శాఖ, ఇతర ముఖ్యమైన శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలను కాపాడే చర్యలను సంసిద్ధతను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, డీఎఫ్ఓ సురేష్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ ఈ వెంకట రమణ, ఆర్డీవో మేఘా గాంధీ, పీ ఆర్ ఈ ఈ అశోక్, జిల్లా మత్స్య అధికారి రెహమాన్, పశుసంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి, డీపీ ఆర్ వో రషీద్, కృష్ణా తహసిల్దార్ శ్రీనివాస్, వాసు నగర్ సర్పంచ్ సాశీతమ్మ, ఇతర జిల్లా శాఖల అధికారులు,రెవెన్యూ సిబ్బంది, గ్రామ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,